నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 17 ఆగస్టు 2024 | KHAMMAM

కొత్త బ్లాకుల కోసం కృషి

- వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కోసం కార్యాచరణ
- సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి
- మణుగూరు పర్యటనలో సింగరేణి సీఎండీ బలరాం

పీకే ఓసీ వ్యూ పాయింట్ వద్ద బొగ్గు ఉత్పత్తిపై అధికారులతో చర్చిస్తున్న సీఎండీ

మణుగూరు టౌన్, ఆగస్టు 16 : ప్రస్తుత ప్రైవేట్ సంస్థల నుంచి, కోల్ ఇండియా నుంచి సింగరేణి గట్టి పోటీని ఎదుర్కొంటోందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొత్త బ్లాకులను పొందేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సింగరేణి మొత్తమ్మీద వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. గురువారం రాత్రి మణుగూరుకు చేరుకున్న ఆయన.. ఏరియా డైరెక్టర్ (పాఅండ్‌పా) జీ.వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఆకస్మికంగా మణుగూరు ఓసీని సందర్శించారు. అక్కడి వ్యూ పాయింట్ నుంచి 640 ఆర్ఎల్ కోల్ బెంచ్ వద్ద భారీ యంత్రాల ద్వారా లోడింగ్ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం ఉదయం బంగ్లాస్ ఏరియాలో, పీకే ఓసీ సైట్ ఆఫీస్ వద్ద మొక్కలు నాటారు. పీకే ఓసీ కొత్త సైట్ ఆఫీస్ వద్ద క్యాంటీన్‌ను పరిశీలించి కార్మికులతో కలిసి అల్పాహారం చేశారు. పీకే ఓసీ వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 వార్షిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత రవాణాలో 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు.

ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో ఒడిశా నైనీ బ్లాక్‌తోపాటు కొత్తగూడెం వీకే గని, ఇల్లెందు రొంపేడు ఓసీ, బెల్లంపల్లి గొల్లేటి ఓసీలను ప్రారంభించి అధికోత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలంటే ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణలో రోజుకు 8 గంటలు సంపూర్ణంగా పనిచేయాలని కోరారు. ఉపరితల గనుల్లో కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన భారీ యంత్రాల వినియోగాన్ని రోజుకు కనీసం 18 గంటలు పెంచాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. అనంతరం సింగరేణి హైస్కూల్లో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. మణుగూరు ఏరియాలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటుకు అధికారులను ఆదేశించారు. అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్యాంసుందర్, శ్రీనివాస్, రమేశ్, రాంబాబు, వీరభద్రుడు, సురేశ్, షబ్బీరుద్దీన్, యూనియన్ల నాయకులు వై.రాంగోపాల్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

'వెంగళరావు' కాల్వ బుంగను పట్టించుకోరా?

- 20 రోజులైనా కన్నెత్తి చూడని అధికారులు
- ఆయకట్టుకు నీరెలా అందుతుందని ప్రశ్న
- బుంగను సందర్శించిన బీఆర్ఎస్ నాయకుల బృందం

కూలిన కాల్వ సైడ్‌వాల్‌ను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ, ఆగస్టు 16 : ప్రధాన ఆయకట్టుకు సాగునీరందించే వెంగళరావు ప్రాజెక్టు కాల్వకు బుంగపడినా అధికారులు కన్నెత్తి చూడడం లేదని, కనీసం మరమ్మతులు చేసే నాథుడు కరువయ్యాడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. దామరచర్ల శివారు వెంగళరావు ప్రాజెక్టు కాల్వకు బుంగపడిన ప్రదేశాన్ని బీఆర్ఎస్ నాయకుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టు సైడ్‌వాల్ కూలిపోయి నెల రోజులు దాటిందని, బుంగపడి ఇరవై రోజులవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. వర్షాలతో నీరు నిల్వకుండా వృథాగా పోతున్నదని, దీంతో ఆయకట్టు భూములకు నీరెలా అందుతుందని వారు ప్రశ్నించారు. అధికారులు వెంటనే బుంగ, సైడ్‌వాల్‌ను పరిశీలించి మరమ్మతులు చేపట్టకపోతే త్వరలోనే రైతులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకట నారాయణ, బీఆర్ఎస్ నాయకులు సంగొండి రాఘవులు, మేడా మోహన్‌రావు, బీరకాయల వెంకటేశ్వర్లు, సానిక మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు తెలిసేలా కళాకృతులు

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కళాకృతులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 16 : గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన కళాకృతులు, వాటి చరిత్ర పర్యాటకులకు తెలిసే విధంగా మ్యూజియంలో అమర్చాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. భద్రాచలం ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియంను శుక్రవారం సందర్శించిన ఆయన మ్యూజియంలో పాతతరానికి సంబంధించిన కళాకృతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాముడు కొలువుదీరిన భద్రాచలం పుణ్యక్షేత్రానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులతోపాటు పాపికొండ అందాలను తిలకించడానికి పర్యాటకులు, భక్తులు ఎక్కువగా వస్తుంటారని, వారు తప్పనిసరిగా ట్రైబల్ మ్యూజియం సందర్శించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియంను టూరిస్ట్ స్పాట్‌గా చేయాలంటే మరింతగా అభివృద్ధి చేయాలని, ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పాతతరం వంట పాత్రలు, నాగళ్లు, బుట్టలు, వారు ధరించే నగలన్నీ మ్యూజియంలో ఉండేలా ఏర్పాటు చేయాలని, వాటి విశిష్టత గురించి పర్యాటకులకు వివరించాలన్నారు. త్వరలోనే మ్యూజియంను టూరిస్ట్ స్పాట్‌గా తీర్చిదిద్దేలా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహారావు, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి ఆలయ భూముల్లో ఆగని ఆక్రమణలు

అడ్డుకున్న ఆలయ ఈవో, సిబ్బందిపై కర్రలతో దాడి

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 16 : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన ఆలయ భూముల్లో ఆక్రమణలు ఆగడం లేదు. సరిహద్దున ఆంధ్రాలోని పురుషోత్తపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆలయ ఈవో, అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. అయితే వీరిపై ఆక్రమణదారులు కర్రలతో దాడులు చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అటు ఆక్రమణదారులు, ఇటు ఆలయ సిబ్బంది మధ్య ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో సంబంధిత శాఖల అధికారులు అక్కడకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా రామాలయ భూములకు అన్ని అనుమతులూ ఉన్నప్పటికీ అక్రమ కట్టడాలను మాత్రం ఆక్రమణదారులు ఆపడంలేదు. 1970 నుంచి 2022 వరకు ఏపీ హైకోర్టుతోపాటు స్థానిక, జిల్లా, ఎండోమెంట్ ట్రైబల్ సెటిల్‌మెంట్ కోర్టులు, తెలంగాణ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగానే ఉత్తర్వులు ఇచ్చాయని ఆలయ ఈవో తెలిపారు. అయినప్పటికీ ఈ ఆక్రమణలు మాత్రం రోజు రోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. గతంలో 250 వరకు, తాజాగా 46 వరకు కేసులు ఆక్రమణదారులపై ఉన్నాయి. కానీ అవేవీ పరిష్కారం కాలేదు. అయితే, ఆలయ భూముల్లో ఆక్రమణదారులు అక్రమ కట్టడాలు కట్టడం వల్ల దేవస్థానానికి వచ్చే కూరగాయలు, ఇతరత్రా ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని ఆలయ ఈవో చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఏపీ రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు రెండు నెలల క్రితం నిర్మాణాలు చేయొద్దని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటికే 50 శాతం నిర్మాణాలు ఆక్రమణదారులు పూర్తిచేశారు. దీంతో ఇటు భద్రాద్రి ఆలయ బాధ్యులు, అటు ఏపీ అధికారులు మండిపడుతున్నారు. తహసీల్దార్ ఆదేశాలు కూడా ఆక్రమణదారులు పాటించుకోవడం లేదు.

పురుషోత్తపట్నంలో భద్రాద్రి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

ఆలయ ఈవో, సిబ్బంది, ఆక్రమణదారుల మధ్య ఉద్రిక్త పరిస్థితి

మా సంగతేంది?

రుణమాఫీ కోసం రైతన్నల అగచాట్లు



- అర్హత ఉన్నా అయోమయంలో అన్నదాతలు
- సొసైటీలు, బ్యాంకర్ల చుట్టూ ఆగని చక్కర్లు
- మూడోవిడత జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ సర్కార్
- కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం
- రూ.2 లక్షల పైబడిన వారికి స్పష్టత కరువు

రైతన్నలకు అరకొరగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అందరికీ రుణమాఫీ చేస్తామని అబద్ధాలు చెప్పి అర్హులను సైతం విస్మరించింది. దీంతో కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం అన్నట్లుగా ఉంది పరిస్థితి. అందరికీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి మూడు విడతల్లో నిధులు విడుదల చేయగా.. మూడోవిడత జాబితాను శుక్రవారం విడుదల చేసింది. అయితే సరిగ్గా రూ.2 లక్షల లోపు రైతులకు మాత్రమే రుణమాఫీ చేయగా.. ఆ పైబడిన రైతుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. అదీకాక అర్హత ఉండి కూడా రూ.2 లక్షలలోపు రైతుల్లో అనేకమందికి రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడత రోజు నుంచి వ్యవసాయ పనులు వదులుకొని మరీ సొసైటీలు, బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. మొత్తానికి తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో తెలియక అన్నదాతలు అమోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

– ఖమ్మం, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రభుత్వం చేసిన రుణమాఫీ వివరాలు

తొలి విడత(రూ.లక్షలోపు)	57,857
రూ.258.25 కోట్లు	విడుదలైన నిధులు
రెండో విడత(రూ.1.50 లక్షలలోపు) రైతులు :	33,942
రూ.262.50 కోట్లు	విడుదలైన నిధులు
మూడో విడత(రూ.2 లక్షలలోపు) రైతులు :	23,546
రూ.245.86 కోట్లు	విడుదలైన నిధులు

ఏదులాపురం సొసైటీలో రుణాలు మాఫీ అయ్యాయో లేదో తెలుసుకుంటున్న రైతులు

తప్పొప్పులు సరిదిద్దేనా..?

రుణమాఫీ జాబితాలో అర్హత ఉండి చిన్నచిన్న పొరపాట్ల కారణంగా అనేక మంది రైతులు పంట రుణమాఫీకి దూరమవుతున్నారు. చిన్నపాటి తప్పొప్పులను సరిదిద్దేందుకు గాను సంబంధిత రైతులు గత కొద్దిరోజుల నుంచి సొసైటీలు, బ్యాంకర్ల చుట్టే చక్కర్లు కొడుతున్నారు. ఒక్క నెంబర్ సరిదిద్దేందుకు గాను అధికారులు చొరవ తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల రుణమాఫీకి సంబంధించి నేటివరకు రెండు దఫాలుగా ప్రభుత్వం రుణమాఫీ నిధులను విడుదల చేసింది. తొలివిడతలో 57,857 మంది రైతులకు గాను రూ.258.25 కోట్లు, రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల పంట రుణాలు తీసుకున్న 33,942 మంది రైతులకు గాను రూ.262.50 కోట్లు.. మొత్తంగా రెండు విడతలు కలిపి 91,799 మంది రైతులకు గాను రూ.520.75 కోట్లు అందజేయడం జరిగింది. అయితే అర్హత కలిగి చిన్నపాటి సాంకేతిక కారణాల వలన పథకానికి దూరమైన రైతులు ఇంచుమించి జిల్లావ్యాప్తంగా 10 నుంచి 15 వేల వరకు ఉండవచ్చని అంచనా. అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ వర్తించేందుకు గాను ఎడిట్ ఆప్షన్ వ్యవసాయ శాఖ అధికారులకు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం ఆధార్ కార్డు నెంబర్‌ను సరిచేసే ఆప్షన్ కూడా మావద్ద లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అర్జీలను తీసుకోవడం వరకే మా బాధ్యత అని బదులిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులకు ఎడిట్ ఆప్షన్ ఇస్తే సాంకేతిక సమస్యలకు చెక్ పడే అవకాశం ఉంది.

మూడో విడత రుణమాఫీకి సంబంధించిన జాబితాను ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా విడుదల చేసింది. కేవలం రైతుల పేర్లతో కూడిన జాబితా మాత్రమే విడుదల కాగా, నిధులకు సంబంధించిన వివరాలు ఎక్కడా పొందుపరచలేదు. మూడు విడతలు కలిపి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,15,345 మంది రైతులకు రుణమాఫీ వర్తించినట్లైంది. అయితే మొత్తం పంట రుణాలు తీసుకున్న జాబితా ప్రకారం పరిశీలిస్తే సగానికి సగం మంది కూడా జాబితాలో లేరు అనేది స్పష్టమవుతున్నది. గురువారం వైరా పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి మూడో విడత రుణమాఫీ నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో అదేరోజు సాయంత్రం నుంచి మరుసటిరోజు సైతం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులు, సొసైటీల చుట్టూ తిరగడం కనిపించింది. వీరికితోడు రూ.2 లక్షల పైబడి పంట రుణాలు తీసుకున్న రైతులు మా పరిస్థితి ఏమిటీ అని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వలన అనేక మంది రైతులు జాబితాలో పేరు రాకపోవడంతో వారు సైతం వ్యవసాయ శాఖ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. పొరపాట్లను సరిదిద్దే అధికారం లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఏదో ఒకటి చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ఇప్పటికైనా పంట రుణాలు తీసుకున్న మొత్తం అర్హత కలిగిన రైతుల వివరాలను లీడ్ బ్యాంకు అధికారులు కానీ, వ్యవసాయ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఉంది. తద్వారా జిల్లా రైతాంగానికి ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

రుణమాఫీ జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న రైతులు

రూ.2 లక్షల పైబడిన వారికి మాఫీ జరిగేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగానే రూ.2 లక్షలకు పైబడి పంట రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారుల సమాచారం ప్రకారం.. జిల్లావ్యాప్తంగా మొత్తం 28 రకాల బ్యాంకుల్లో కలిపి 3,71,157 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. వీరికి సుమారుగా రూ.4,307 కోట్ల రుణమాఫీ వర్తించే అవకాశం ఉంది. అయితే మూడు విడతలు కలిపి నేటివరకు 1,15,345 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించింది. అంటే మరో 2,55,812 మందికి రుణమాఫీ రావాల్సి ఉంది. అయితే రూ.2 లక్షలకు పైబడి పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో ప్రభుత్వం రూ.2 లక్షల పంట రుణాలు తీసుకున్న రైతులు పై నిధులను బ్యాంకులో చెల్లిస్తే రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయడం జరుగుతుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో సదరు రైతులు పక్షం రోజుల నుంచి రూ.2 లక్షల పైబడిన సొమ్ము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత అధికారులకు చెబుతున్నా వారు రుణాలు కట్టించుకోని పరిస్థితి నెలకొంది. పైబడిన నిధులు రెండు బ్యాంకుల్లో ఉంటే ఏ బ్యాంకులో కట్టాలి. కుటుంబంలో ఇద్దరు పేరు మీద ఉంటే ఎవరు పేరుమీద కట్టాలి అనే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు రైతులు అనేక మంది బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం కనబడడం లేదు.

'మాఫీ'పై సీఎంది దాటవేత ధోరణి

- సభకు పిలిచి రుణమాఫీ చెక్కులు ఇవ్వరాయె..
- వైరా నియోజకవర్గంపై కురిపించని వరాలు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరాటౌన్, ఆగస్టు 16 : మూడు విడతల్లో 22,37,848 మంది రైతులకు రూ.17,933 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం మిగిలిన రైతులకు నాల్గవ విడత ఎప్పుడు విడుదల చేస్తారనేది దానిపై ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు స్పష్టత ఇవ్వకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారని, ఇది సరైన విధానం కాదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా రుణమాఫీ చెక్కులు అందిస్తామని రైతులను పిలిచి చెక్కులు ఇవ్వకపోవడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారన్నారు. సీతారామ ప్రాజెక్టును 2026, ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారే తప్ప ఏ ఇతర అంశాలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. సీతారామ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.687 కోట్ల నిధులు మిగిలిన భూ సేకరణ పరిహారం చెల్లింపులకు కూడా సరిపోవని, సీఎం హామీ ప్రకారం రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే అవసరమైన రూ.8 వేల కోట్లు గ్రీన్ చానల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ, సాగర్ ఎడమ కాల్వ లింక్ కెనాల్, రాజీవ్ సాగర్‌కు భూములు ఇచ్చిన రైతులకు కనీసం పరిహారం కూడా ప్రకటించలేదన్నారు. వైరా నియోజకవర్గంపై సీఎం వరాలు కురిపిస్తారని ఎంతో ఆశగా ఎదురుచూసినా ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. సమావేశంలో వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, రైతు సంఘం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైరాకు వరాలేవి?

నిరాశపరిచిన సీఎం పర్యటన : బీఆర్ఎస్

కారేపల్లి, ఆగస్టు 16 : తొలిసారిగా వైరా నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో వరాలు ప్రకటిస్తారని, అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని ఎదురుచూసినా.. ఎలాంటి హామీ చేయకపోవడంతో ప్రజలు నిరాశ చెందారని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు వెనుకబాటుకు గురైన వైరా నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో చేస్తారని, వరాలు కురిపిస్తారని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారన్నారు. కనీసం మున్సిపాలిటీ అభివృద్ధికి, రిజర్వాయర్ చుట్టూ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి, విలీన గ్రామాల్లో అపరిష్కృత సమస్యల పరిష్కారంపై ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ మణికొండ నాగేశ్వరరావు, నాయకులు ఖలీలుల్లా ఖాన్, సద్దాం, ఫిరోజ్, కొణిదల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట

- రెండు నెలలుగా నల్లాలు రాకపోవడంతో ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆవేదన
- మరమ్మతులకు గురైన పంపు వద్ద ఖాళీ బిందెలతో నిరసన

చండ్రుగొండ, ఆగస్టు 16 : మిషన్ భగీరథ నీరు రెండు నెలలుగా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ దెబ్బతిని.. మోటరు మరమ్మతులకు గురైనా పట్టించుకునేవారు కరువయ్యారని ఆందోళన చెందుతున్నారు. చేసేది లేక చెడిపోయిన మంచినీటి పథకం వద్ద వంకనంబర్ గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో వంద కుటుంబాలకు తాగునీరు లేక రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించే పైపులైన్ దెబ్బతిన్నదని, మోటర్ సైతం పని చేయకపోవడంతో రెండు నెలలుగా మంచినీరు రావడం లేదని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంచాయతీకి నిధులు రాగానే మరమ్మతు చేయిస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, రోజూ పంపుల ద్వారా నీరు వచ్చే విధంగా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తెల్ల లక్ష్మి, పద్దం శాంతకుమారి, తాటి విజయకుమారి, కుంజ సుక్కమ్మ, యదలపల్లి పైలు, పైదమ్మ, కుంజ నర్సింహారావు, పైదబాబు, బొర్రా విజయ, కుంజా నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చెడిపోయిన పంపు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి పీహెచ్‌సీ తనిఖీలో వైద్యారోగ్య శాఖ కమిషనర్ కర్ణన్

పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

కూసుమంచి, ఆగస్టు 16: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. వ్యాధుల కట్టడిలో ఎక్కడ అజాగ్రత్త వహించినా సమస్య జటిలమవుతుందని అన్నారు. అందుకే ప్రతీ గ్రామంలో రోజువారీగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఖమ్మం వెళ్తున్న ఆయన.. కూసుమంచి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో డెంగీ, సీజనల్ జ్వరాలు, నివారణ చర్యలు తదితర అంశాల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందులు, ల్యాబ్ టెస్టుల గురించి డాక్టర్ కిశోర్,ఫర్హత్‌లను అడిగి తెలుసుకున్నారు. 'ఏ గ్రామాల్లో జ్వరాలు ఉన్నాయి? ఎంతమందికి టెస్టులు చేశారు? వాటి రిపోర్టులు ఏంటి?' అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, సీహెచ్‌వో పలీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.